
సాక్షి ఒడిశా
శనివారం । 23 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,88,290లు, బంగారం 520 మిల్లీగ్రాములు, వెండి 56 గ్రాములు 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వణికిస్తున్న చలి పులి

రాష్ట్రాన్ని చలిపులి వణికిస్తోంది. పలు ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

- 8లో



రూ.112 కోట్లతో..

ఢెంకనాల్ జిల్లా జోరండాలో మహిమ పుణ్యక్షేత్రాన్ని రూ.112 కోట్లతో అభివృద్ధి చేసేందుకు సీఎం నవీన్ భూమిపూజ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

వృద్ధులకు దుప్పట్ల వితరణ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

జయపురం: డొంగరచించి గ్రామంలో వృద్ధులు, అనాథలకు జయపురం రోటరీ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్ర పట్నాయక్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో వెయ్యి దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పెన్షన్ తీసుకునేందుకు వచ్చే సమయంలో అందజేసేందుకు వీలుగా ఈ దుప్పట్లను పంచాయతీ కార్యాలయంలోనే ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సలహాదారుడు అంజనీకుమార్ అగర్వాలా, కార్యదర్శి సందీప్ ఝూండ్, రాజీవ్ సేన, సరోజ్ సాహు, రామపూజారి, రామావతార్, రామకృష్ణ, ఈశ్వరరావు, సర్పంచ్ కమళ లోచన గదబ, సమాజ సేవి నారాయణ మహంతి తదితరులు పాల్గున్నారు.

పాలిథిన్ వినియోగంపై ఉక్కుపాదం



నర్సరీ నిర్వాహకుడికి జరిమానా పత్రం అందించిన బీఎంసీ అధికారులు

భువనేశ్వర్: నగరంలో పాలిథిన్ వినియోగంపై భువనేశ్వర్ నగర పాలక సంస్థ (బీఎంసీ) ఉక్కుపాదం మోపుతోంది. నగర వ్యాప్తంగా పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపడుతోంది. పాలిథిన్ నివారణతో పరిసరాల్లో పరిశుభ్రత నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. స్థానిక 63వ నంబరు వార్డు ఖండగిరి స్క్వేర్ ప్రాంతం ఆరు చోట్ల నర్సరీ ప్రాంగణాల్లో తనిఖీలు చేపట్టి పాలిథిన్ వాడుతున్నందుకు రూ.96,000 జరిమానా విధించింది. 49వ నంబరు వార్డు పరిధిలో 3 నర్సరీ ప్రాంగణాల్లో తనిఖీలు చేపట్టి రూ.55,000 అపరాధ రుసుం వసూలు చేశారు. 5 మీటర్ల పరిధిలో నర్సరీలు పరిశుభ్రతకు బాధ్యత వహించి పాలిథిన్ కట్టడికి చర్యలు చేపట్టాలని బీఎంసీ నిబంధన విధించింది.

జయపురం చేరిన అయోధ్య అక్షితలు



కలశాలతో కార్యకర్తలు

జయపురం: వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న అయోధ్య శ్రీరామ మందిర ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా స్థానిక ప్రజలను ఆహ్వానించేందుకు ఉద్దేశించిన ఆహ్వాన అక్షితలు శుక్రవారం జయపురం చేరాయి. స్థానిక గీతా మందిరంలో వీటిని భద్రపరిచారు. కొరాపుట్ జిల్లాలోని పంచాయతీ సమితిలకు, పురపాలక పరిషత్‌లకు అక్షితలు చేరవేస్తారు. ప్రతి ఇంటికి వెళ్లి అక్షితలు అందజేసి ఆహ్వానించనున్నట్లు జయపురం శ్రీరామ మందిర ప్రతిష్ఠాపన ఉత్సవ ఆహ్వాన కమిటీ వెల్లడించింది.

నకిలీ గుట్కా స్వాధీనం



గుట్కా సామగ్రిని పరిశీలిస్తున్న పోలీసులు

బరంపురం : నగర శివారులోని లుచ్చాపడా-రోహి గ్రామం మధ్య రహదారిని ఆనుకుని నకిలీ గుట్కా తయారు చేస్తున్న కర్మాగారంపై పోలీసులు దాడి చేశారు. భారీ ఎత్తున గుట్కా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్పీ సర్వాణ్ వివేక్ ఆదేశాలతో సదర్ పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి శుక్రవారం మధ్యాహ్నం దాడి చేశారు. గుట్కా సామగ్రి, లేబుల్స్, యంత్రాలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు.

వెరైటీ ఆలోచన



- హైవేలపై రాత్రిపూట డ్రైవర్లకు ఉచితంగా టీ
- నిద్రమత్తు దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు
- రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం: మంత్రి సాహు

భువనేశ్వర్: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రధానంగా జాతీయ రహదారులపై ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం పరిధిలో జాతీయ రహదారులపై రాత్రివేళల్లో వాహన చోదకులకు ఉచితంగా టీ సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు హైవేను అనుకుని ఉన్న దాబాలు, హోటళ్లలో రాత్రిపూట వాహనచోదకులకు టీ ఉచితంగా అందజేస్తామని రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి టుకుని సాహు తెలిపారు. డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు కూడా సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

కలెక్టర్ల పర్యవేక్షణలో..

జాతీయ రహదారులపై రాత్రిపూట టీ ఉచితంగా పంపిణీ చేసే కార్యకలాపాలు ప్రాంతీయ కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. టీ కేంద్రాలతో తినుబండారాల కేంద్రాల ఏర్పాట్లు పరిశీలిస్తారు. రాత్రిపూట నిద్రమత్తు, కునుకుపాటు, నిద్ర సంబంధిత ప్రమాదాలను నివారించడానికి డ్రైవర్లకు ఉచిత టీ అందించనున్నట్లు మంత్రి వివరించారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలతో..

వచ్చే ఏడాది జరగనున్న రహదారి భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జనవరి 1 నుంచి 7 వరకు జరిగే రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ప్రాంతీయ రవాణా కార్యాలయాలు (ఆర్‌టీఓ) ఉచితంగా టీ అందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాయి.

తనిఖీలు ముమ్మరం..

నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ తనిఖీలు ముమ్మరం చేస్తారు. మద్యం తాగి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో వాహనాలు రావడం, ఇతర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఉషా పాఢి అధికారులను ఆదేశించారు. పిక్నిక్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పిక్నిక్ స్పాట్‌లలో రహదారి ప్రమాదాల నివారణ కార్యాచరణ అమలు చేయడానికి నిర్ధారిత కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ)ని జారీ చేయాలని రాష్ట్ర రవాణా అథారిటీ కమిషనర్‌కు ఆదేశించారు.

ఆరోగ్య పరీక్షలు..

అంతేకాకుండా రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ పంపులు, హోటళ్ల దగ్గర డ్రైవర్లకు కంటి పరీక్షల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ప్రాంతీయ రవాణా కార్యాలయాలకు ఆదేశించారు.

రేపటి నుంచి అల్టిమేట్ ఖోఖో పోటీలు

- ముఖ్యమంత్రికి సీజన్-2 మొదటి టికెట్ అందజేత



సీఎం నవీన్‌కు నమూనా టికెట్ అందజేస్తున్న లీగ్ సీఈఓ టెంజింగ్ నియోగి

భువనేశ్వర్: భారతీయ సంప్రదాయ క్రీడ ఖోఖోను ప్రోత్సహించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. కటక్ జె.ఎన్.ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24న ప్రారంభం కానున్న అల్టిమేట్ ఖోఖో సీజన్-2కు సంబంధించి తొలి టికెట్‌ను నిర్వాహకులు సీఎం నవీన్‌కు శుక్రవారం అందజేశారు. అనంతరం సీఈఓ, లీగ్ కమిషనర్ టెంజింగ్ నియోగి మాట్లాడుతూ తొలి టికెట్‌ను సీఎంకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సీజన్‌లో 16 నుంచి 18 ఏళ్ల వయసు గల 33 మంది యువ ప్రతిభావంతులతో సహా భారతదేశపు అగ్రశ్రేణి 145 మంది ఆటగాళ్లు పాల్గొంటారని చెప్పారు. చెన్నై క్విక్‌గన్స్, గుజరాత్ జెయింట్స్, ముంబై ఖిలాడీస్, రాజస్థాన్ వారియర్స్, తెలుగు యోధాతో పాటు డిఫెండింగ్ చాంపియన్ ఒడిశా జగ్గర్‌నాట్స్ ఈ సీజన్‌లో పోటీ పడతాయని వివరించారు.

కేసులు లేవని నిర్లక్ష్యం వద్దు

- కోవిడ్ జాగ్రత్తలు తప్పక పాటించాలి
- మాస్క్ ధారణే శ్రీరామరక్ష: రాష్ట్ర ఆరోగ్య శాఖ



భువనేశ్వర్: కోవిడ్ చాయలు మరోసారి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కొత్త రకం వైరస్ కారణంగా దేశంలో ఇటీవల కొందరు మృత్యువాత పడిన నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు భావిస్తే బాధితులు వెంటనే కోవిడ్ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని ప్రజలకు సూచించింది. ఈ నెల 3 నుంచి రాష్ట్రంలో ఎలాంటి కోవిడ్ కేసు నమోదు కాలేదని, అయినప్పటికీ ముందుజాగ్రత్త చర్యగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు కోవిడ్ నిర్ధారణ పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా మీడియా ద్వారా శుక్రవారం తెలియజేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్తే మాస్క్ ధరించడం మంచిదని హితవు పలికారు. సాధారణ జలుబు, సీజనల్ ఫ్లూ మాదిరిగానే కొత్త రకం వేరియంట్ లక్షణాలు ఉన్నాయని, ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందవచ్చని చెప్పారు. ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని, వైరస్ ధృవీకరణ జరిగితే గదిలో ఒంటరిగా ఉండాలని సూచించారు.

అప్రమత్తమైన ప్రభుత్వం..

కోవిడ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అనుసరిస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైనప్పుడు చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ డైరెక్టర్ తెలిపారు. ప్రస్తుతం సరిపడా మందులు, ఆస్పత్రుల్లో పడకలు, ఆక్సిజన్, అనుబంధ సామగ్రి సిద్ధంగా ఉందని చెప్పారు.

కేరళలోనే అధికం..

బీఏ 2.86 ఓమిక్రాన్ స్ట్రెయిన్ ఉప-వేరియంట్ అయిన జేఎన్.1 ఆవిర్భావంతో దేశంలో క్రియాశీల కోవిడ్ పీడితుల సంఖ్య పెరిగింది. అమెరికా, మలేషియా, గపూర్‌లో కోవిడ్ కేసుల పెరుగుదలకు ఉప-వేరియంట్ ముడిపడి ఉందని ఆరోగ్య నిపుణులు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు దేశవ్యాప్తంగా నమోదైన 328 కరోనా వైరస్ సంక్రమణలో 265 కేసులు కేరళకు చెందినవని ప్రకటించారు. ఇక్కడ క్రియాశీలక కోవిడ్ రోగుల సంఖ్య 2,606కి చేరుకుంది. ఇప్పటికే కేరళలో ఒకరు మరణించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం 60 ఏళ్లు పైబడిన వారు, గుండె కిడ్నీ వంటి దీర్ఘకాలిక రోగ పీడితులు, జలుబు, దగ్గు వంటి కోవిడ్-19 లక్షణాలు ఉన్నవారు బహిరంగ ప్రదేశాల్లో మాస్క్‌లు ధరించడం తప్పనిసరి చేసింది.

రైల్వే లైన్ నిర్మాణం పూర్తిచేయాలి



మాట్లాడుతున్న నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్-జయపూర్ రైల్వే నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ నబరంగ్‌పూర్-జయపూర్, జయపూర్-మల్కన్‌గిరి రైల్వే లైన్ల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతాయో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం-ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఎంఓయూలు మార్చుకున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. దీనిపై రైల్వే శాఖ మంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్ స్పందిస్తూ 2014 వరకు కేంద్ర ప్రభుత్వ ఒడిశా రాష్ట్రానికి ఏడాదికి రు.800 కోట్లు మాత్రమే కేటాయించేదన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం రు.10 వేల కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అప్పట్లో ఏడాదికి 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం మాత్రమే రాష్ట్రంలో రైల్వే లైన్ నిర్మాణం జరిగేదని, ఈ ఏడాది 450 కిలోమీటర్ల నిర్మాణం లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. నిర్మాణాలు త్వరలోనే పూర్తవుతాయని రైల్వే మంత్రి సమాధానమిచ్చారు.

యువతి దారుణ హత్య



లక్ష్మీ మాఝి (ఫైల్)

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో మా గృహం వెనుక ఓ యువతి దారుణ హత్యకు గురయ్యింది. పూర్తిగా కాలిపోయిన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు మా గృహంలో మేనేజర్‌గా పనిచేస్తున్న లక్ష్మీ మాఝి(23)గా గుర్తించారు. జిల్లాలోని కాసీపూర్ సమితి నకిటిగుడ గ్రామానికి చెందిన ఈమె ఐదేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం మా గృహం వెనుక కాలిపోయిన యువతి మృతదేహాన్ని గుర్తించిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి తండ్రి బాలేదార్ మాఝి తన కుమార్తెను దారుణంగా తగులబెట్టి హత్య చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రధాన పౌరసరఫరాల అధికారి అరెస్ట్

- ఆదాయానికి మించి ఆస్తులు



ప్రశాంతకుమార్ గౌంతాయత్

భువనేశ్వర్ : ఆదాయానికి మించిన ఆస్తుల ఆర్జన ఆరోపణ కింద భువనేశ్వర్ ప్రధాన పౌరసరఫరాల అధికారి ప్రశాంతకుమార్ గౌంతాయత్‌ని అరెస్టు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ అధికారులు తెలిపారు. ఇల్లు, కార్యాలయంలో చేపట్టిన దాడుల్లో లెక్కకు మించి ఆస్తులు, నగలు, ఆభరణాలు, నగదు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఒడిశా విజిలెన్స్ అధికారులు గౌంతాయత్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. భువనేశ్వర్‌లో 2 బహుళ అంతస్తుల భవనాలు, 2 ఫ్లాట్లు, 5 ఇళ్ల స్థలాలు, రూ. కోటీ 48 లక్షల బ్యాంకు ఖాతాల వివరాలు బయటపడ్డాయి. ఈ దాడుల్లో 536 గ్రాముల బంగారం, రూ.1.21 లక్షల నగదు, విలాసవంతమైన 4 చక్రాల వాహనం కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేసి స్థానిక విజిలెన్స్ ప్రత్యేక న్యాయమూర్తి కోర్టులో హాజరుపరిచారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

జయపురం: మండీలు వెంటనే తెరిచి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని కొరాపుట్ జిల్లా కిషాన్ మంచ్ నేతృత్వంలో రైతులు శుక్రవారం జయపురం సబ్‌కలక్టర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులను ఘెరావ్ చేశారు. ఈ నెల 14 నుంచి మండీలు తెరచి ధాన్యం కొంటామని ఇటీవల అధికారులు హామీ ఇచ్చి తర్వాత పట్టించుకోలేదని మండిపడ్డారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలక్టర్ ప్రభాత్ కుమార్ పరిచకు వినతిపత్రం అందించారు. తక్షణమే ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రదీప్ పండా ప్రకటించడంతో రైతులు శాంతించారు.

మండికీ తాళం..



ఆందోళన చేస్తున్న ఇంద్రావతి గ్రూప్ మహిళలు

మల్కన్‌గిరి: ధాన్యం కొనుగోలు తమకు అప్పగించకపోవడాన్ని నిరసిస్తూ మల్కన్‌గిరిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు శుక్రవారం మండీకి తాళం వేశారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా అమ్మకాల బాధ్యత తమకే అప్పగించాలని డిమాండ్ చేశారు.

కొత్త జిల్లాల ఏర్పాటుకు బ్రేక్

- మధ్యంతర స్టే విధించిన హైకోర్టు
- వివరాలకు సమయం కోరిన ఏజీ
- తదుపరి విచారణ వాయిదా



ప్రత్యేక జయపురం జిల్లా కోసం బస్టాండ్ కూడలి వద్ద ఆందోళన చేస్తున్న కమిటీ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర హై కోర్టు ఆంక్షలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిన పదంపూర్ జిల్లా ఏర్పాటుకు క్లెం పడింది. హైకోర్టు అనుమతి లేకుండా కొత్త జిల్లాలను ఏర్పాటు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. బర్గాడ్ జిల్లాలోని పదంపూర్ సబ్ డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా మార్చాలనే ప్రభుత్వ యోచనకు షాక్ తగిలినట్లయ్యింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలనుకునే జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కొనసాగవచ్చని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.షడంగి, న్యాయమూర్తి మురహరి శ్రీరామ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. రాయ్‌రంగ్‌పూర్ జిల్లా క్రియాశీలక కమిటీ అధ్యక్షుడు అక్షయ కుమార్ మహంతి దాఖలు చేసిన పిటిషన్ ఈ తీర్పును వెలువరించింది. ఈ క్రమంలో నిర్దిష్టమైన మార్గదర్శకాలు, సూత్రాలు లేకుండా ప్రభుత్వం ఇష్టానుసారం కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తున్నట్లు ధర్మాసనం గమనించింది. కొత్త జిల్లా ఏర్పాటు పురస్కరించుకుని అనుబంధ డిమాండ్‌లను పరిశీలించడానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించాలని పిటిషనరు న్యాయ స్థానానికి అభ్యర్థించడం గమనార్హం. రాష్ట్రంలో కొత్త జిల్లాలు బామన్‌ఘటి (రాయిరంగపూర్), పంచపిడ్ (కరంజియా) సబ్-డివిజన్‌లను చేర్చి రాయంగ్‌పూర్ జిల్లా ఏర్పాటు చేసినట్లు పిటిషనరు హైకోర్టు దృష్టికి తీసుకుని వెళ్లారు. ప్రభుత్వం తరఫు అదనపు ప్రభుత్వ న్యాయవాది డి.కె.మహంతితో పాటు హాజరైన అడ్వకెట్ జనరల్ ఎ.కె. పరిజా ఈ విషయంలో సూచనల కోసం కొంత సమయం కేటాయించాలని న్యాయమూర్తులకు అభ్యర్థించారు.

పూర్తి వివరాలేవీ..?

ఇటీవల కొత్త జిల్లా ఏర్పాటుకు పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు సంబంధించి 1975లో జస్టిస్ రాజ్ కిషోర్ దాస్ కమిటీ, 1991లోని క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక తప్ప ఇతర వివరాలు రికార్డులో లేనట్లు ధర్మాసనం గుర్తించింది. ఈ పరిస్థితుల దృష్ట్యా అడ్వకేట్ జనరల్ అభ్యర్థన మేరకు ఈ విషయంలో సూచనలను పొందేందుకు సమయం మంజూరు చేసినట్లు ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టదలచిన జిల్లా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కొనసాగించడం అవసరమని న్యాయస్థానం భావించింది. కొత్త జిల్లా ఏర్పాటు పురస్కరించుకుని హైకోర్టు అనుమతి లేకుండా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని ఆంక్షలు విధించింది. శీతాకాలం సెలవులు ముగిసిన తర్వాత రెండు వారాల తర్వాత కేసు విచారణ చేపడతామని ధర్మాసనం ప్రకటించింది.

తాత్కాలికంగా బ్రేక్..

ఏడాదిలోగా పదంపూర్‌కు జిల్లా హోదా కల్పిస్తామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గత డిసెంబర్‌లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఏడాదిలోగా పదంపూర్ కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో పునరుద్ఘాటించారు. గత ఏడాది డిసెంబరులో ఉప ఎన్నిక పురస్కరించుకుని పదంపూర్ జిల్లాను ఏర్పాటు చేస్తామని అధికార పక్షం బిజూ జనతా దళ్ ఎన్నికల వాగ్దానంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కోర్టు ఉత్తర్వుతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది. పదంపూర్‌తో కంటాబంజి, టిట్లాగడ్, అఠాగొడా, ధర్మగఢ్, మరికొన్ని ప్రాంతాల ప్రజలు కూడా ప్రత్యేక జిల్లాలను డిమాండ్ చేస్తున్నారు.

జయపురం జిల్లా ఏర్పాటు చేయాల్సిందే..

జయపురం: అవిభక్త కొరాపుట్‌లో ప్రధాన పట్టణమైన జయపురం రాజధానిగా జయపురం జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. శుక్రవారం జయపురం జిల్లా కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

జయపురం, బొరిగుమ్మ, బొయిపరిగుడ, కుంధ్ర, కొట్‌పాడ్, లమతాపుట్, సమితిలు, జయపురం మునిసిపాలిటీ, కొట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లను కలిపి జయపురం జిల్లా ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ప్రస్తుతం సబ్ డివిజన్‌గా ఉండటంతో సరైన సౌకర్యాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని చెప్పారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నియమాలపై అవగాహన


నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జయపురం: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. జయపురం సబ్ డివిజన్ కుంద్రా గ్రామంలో బిజూ పట్నాయక్ ఉన్నత మాధ్యమిక పాఠశాలలో శనివారం 'అమొ ఒడిశా' సంస్థ ఆధ్వర్యంలో సమాజ సచేతన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వీధి నాటకాలను ప్రదర్శించి ప్రజలను చైతన్యం చేశారు.

వైద్యసేవలు పరిశీలన


వైద్యాధికారులతో చర్చిస్తున్న కాయకల్ప బృందం

జయపురం: జిల్లా కేంద్రాస్పత్రిని శుక్రవారం కాయకల్ప బృందం సందర్శించింది. రోగులను అందుతున్న సేవలపై సభ్యులు ఆరా తీశారు. నివేదికను రాష్ట్ర ఆరోగ్య మిషన్ డైరెక్టర్‌కు అందజేస్తామని టీమ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ ఎస్.పి.మహారాణ, జిల్లా క్వాలిటీ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ మిశ్రా, హాస్పిటల్ మేనేజర్ శశాంక శేఖర పండిత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు రూ.3వేలకు పెంచాలని డిమాండ్


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బరంపురం: రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఒడిశాలో వృద్ధాప్య, వితంతు పింఛన్లను రూ.3వేలకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ సాహు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దక్షిణాంచల్ రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్‌డీసీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ నందా తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

సాలూరు: పాచిపెంట మండలం పి.కోనవలస ఘాట్‌రోడ్డు వద్ద లారీ శుక్రవారం బోల్తా పడగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని బొరిగాం నుంచి విశాఖపట్నం పోర్టుకు బియ్యం లోడుతో వస్తున్న లారీ ఘాట్‌రోడ్డులో 3వ మైలు వద్ద బోల్తాకొట్టి లోయలో పడింది.ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు, జరిమానా

పాలకొండ రూరల్: చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి పాలకొండ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ రాజ్‌కుమార్ ఏడాది జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధించినట్లు పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖకు చెందిన చిన్నవాడు పాటకొండ పట్టాణానికి చెందిన పాట్నూరు లక్ష్మణరావుకు ఇచ్చి న చెక్‌బౌన్స్ కావడంతో ఆయన ఫిర్యాదు చేశాడు. ఈ కేసు విచారణ పూర్తి కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెలువరించినట్లు స్పష్టం చేశారు.

గాయపడిన వీఆర్‌ఓ మృతి

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురం జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీఆర్‌ఓ యలగాడ రాజారావు (51) శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన భార్య అనసూయ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.వి.రమణ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. రాజారావు చిదిమి సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేసేవారు. ఆయన మృతి పట్ల తహసీల్దార్ చందక సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. ప్రభుత్వ పరంగా రాజారావు కుటుంబానికి అండగా ఉంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి..

మెరకముడిదాం: మండలంలోని యాడిక గ్రామానికి చెందిన రెల్లి సూరినాయుడు (54) శుక్రవారం విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రెల్లిసూరినాయుడు తన పొలంలో జొన్నచేనుకు నీరు కట్టేందుకు వెళ్లి మోటార్ ఆన్ చేశాడు. అయితే మోటార్ పనిచేయకపోవడంతో ఫ్యూజ్ పోయినట్లు ఉందని భావించి ఫ్యూజ్ తీసి చూసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు భోరున విలపించారు. మృతుడి భార్య తవిటమ్మ ఫిర్యాదు మేరకు బుదరాయవలస హెడ్‌కానిస్టేబుల్ అంజిబాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వణికిస్తున్న చలి పులి!

- పుల్బణిలో కనిష్టంగా 4 డిగ్రీల ఉష్ణోగ్రత
- కలెక్టర్లకు ఎస్ఆర్‌సీ ప్రత్యేక సూచనలు


దరింగబడిలో మంచులో పర్యాటకులు


దరింగబడిలో కురుస్తున్న మంచు

బరంపురం: రాష్ట్రాన్ని చలి పులి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. కొంధమాల్ జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుల్బణి పట్టణంలో శుక్ర, శనివారాల్లో 4 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఒడిశా కాశ్మీర్‌గా పేరుగాంచిన దరింగబడిలో కనిష్ట ఉష్ణోగ్రతలు సున్నాకు చేరినట్లు సమాచారం. పుల్బణి, దరింగబడి, కొటగడ్, జి.ఉదయగిరి, బల్లిగుడా, తుమ్ముడిబొందొ, రైకియా, పిరిగింయా, బలందపడా, బ్రమ్మణిగామ్‌లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. మర్వోఐపు దరింగబడికి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఉదయం 10 గంటల వరకు మంచుదుప్పటిలా మారిన పరిసరాలను తిలకించేందుకు సందర్శకులు భారీ ఎత్తున తరలివస్తున్నారు.


కొంధమాల్ జిల్లా అటవీ ప్రాంతంలో కురుస్తున్న మంచు

దండకారణ్యంలో ఏడు డిగ్రీలు..

కొరాపుట్: దండకారణ్యంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు దిగజారుతున్నాయి. శుక్రవారం అత్యల్పంగా 7.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పొగమంచు ధాటికి వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై, హైదరబాద్, విజయవాడ తదితర దూరప్రాంతాల నుంచి కొరాపుట్ జిల్లాలకు వచ్చే బస్సులు ఆలస్యంగా చేరుకుంటున్నాయి.

ఎస్ఆర్‌సీ హెచ్చరిక

భువనేశ్వర్: రాష్ట్రంలో చలిగాలులు, దట్టమైన మంచు ప్రభావం మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది. రానున్న మూడు రోజుల పాటు తీవ్రత కొనసాగుతుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉంటాలంటూ ఒడిశా స్పెషల్ రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సి) కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్‌లకు రాసిన లేఖలో పేర్కొంది. ఈ నెల 23, 24 తేదీల్లో పూరీ, ఖుర్దా, నయాగడ్, గంజాం, గజపతి, సుందర్‌గడ్, కెంజొహర్, ఢెంకనాల్, కటక్, కంధమల్, కలహండి, రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో పొగమంచు దట్టంగా ఉంటుందని అంచనా వేస్తోంది. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి, కొరాపుట్, కలహండి, కంధమల్, బొలంగీర్, సుందర్‌గడ్, కెంజొహర్, మయూర్‌భంజ్, అంగుల్, ఢెంకనాల్, వంటి 21 జిల్లాల్లో ఈ నెల 25న దట్టమైన మంచు కమ్మే సంకేతాలు జారీ అయినట్లు ఎస్ఆర్‌సీ పేర్కొంది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాల రాకపోకలను నియంత్రించాలని అధికారులను ఆదేశించింది.

రూ.112 కోట్లతో మహిమా మందిరం అభివృద్ధి


మహిమా గాది సంత్‌లతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

- భూమిపూజ చేసిన సీఎం నవీన్

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా జోరండాలో మహిమ పుణ్యక్షేత్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఇక్కడ రూ.112 కోట్లతో పలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పించనుంది. మతాన్ని వ్యాప్తి చేసిన మహిమా గోస్వామి 'సమాధి పీఠం' పునరుద్ధరణతో పాటు, ప్రార్థనా మందిరం, బత్తీ మండపం నిర్మించనున్నారు. మందిరం లోపల ఉన్న పవిత్ర చెరువు పునర్నిర్మాణం, మహిమ సమాజ పీఠం పునర్నిర్మిస్తారు. సందర్శకుల సౌకర్యార్థం బస్టాండ్, సంత్‌ల కోసం 200 మరుగుదొడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా నిర్మించనున్నారు. క్యాంపస్ మొత్తం సుందరీకరణ కూడా చేయనున్నారు. జోరాండాలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఒడిశా దేవభూమి, పవిత్ర భూమి అని చెప్పారు. మహిమా సంస్కృతి జోరాండా భూమిని పవిత్రం చేసిందని కొనియాడారు. ఇంతటి పుణ్య భూమిని సందర్శించే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. మహిమ ఆరాధనలో గొప్ప సాధువు భీమా భోయి సందేశం స్ఫూర్తిదాయకమని చెప్పారు. అభివృద్ధి పనులు మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. రాబోయే మాఘ మేళా, అగ్ని పూర్ణిమకు నవీన్ పట్నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉక్కు, గనుల శాఖ మంత్రి ప్రఫుల్లకుమార్ మల్లిక్, ఢెంకనాల్ ఎంపీ మహేష్ కుమార్ సాహు, ఎమ్మెల్యేలు సుధీర్ కుమార్ సామల్, నృసింగ్ చరణ్ సాహు, అర్చన పుహాన్, 5టీ చైర్మన్ వీకే పాండియన్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజకు హాజరైన సంత్‌లు, భక్తులు

భోపాల్ పర్యటనకు గిరిజన యువత


గిరిజన యువతతో బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఎం.వి.3 గ్రామం వద్ద బీఎస్ఎఫ్ క్యాంప్ ఆధ్వర్యంలో 20 మంది గిరిజన యువతను భోపాల్ పర్యటనకు పంపిస్తున్నట్లు క్యాంపు అధికారి శివ ఓం తెలిపారు. శుక్రవారం చిత్రకొండ సమితి జోడాంబో పంచాయతీ పరిధిలోని సింధీగూడ, గురసేత్, సింధిపూట్, డోరాల్‌బేడ తదితర గ్రామాలకు చెందిన గిరిజన యువతను ట్రిప్‌కు పంపించారు. భోపాల్‌లో పర్యాటకు ప్రదేశాలతో ప్రముఖులతో భేటీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. వీటంతటికీ బీఎస్ఎఫ్ ఖర్చు భరిస్తుందని అధికారులు తెలిపారు.

● గణితం కీలకం


మాట్లాడుతున్న దేవాశీష్

రాయగడ: వైద్య, రసాయన, భౌతిక, ఆర్థిక శాస్త్రాలకు మూలం గణిత శాస్త్రమేనని ప్రభుత్వ మోడరన్ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దేవాశీష్ శర్మ అన్నారు. శుక్రవారం రాయగడలోని అటానమస్ కళాశాల గోల్డెన్ జూబ్లీ హాలులో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస్ రామానుజన్ జయంతి, జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రశాంత్ కుమార్, అధ్యాపకులు భాస్కర్ గుప్తా మ్యాథ్స్ ప్రాముఖ్యతను వివరించారు. శ్రీనివాస్ రామానుజం సేవలను కొనియాడారు.

ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం


భువనేశ్వర్: నిరసనకారుల్ని పోలీసు వ్యానులోకి నెడుతున్న పోలీసులు



భువనేశ్వర్: ఇండియా వర్గీయుల భారీ ప్రదర్శన

భువనేశ్వర్: ఒడిశా ఎంపీల సస్పెన్షన్, పార్లమెంటు భద్రతా ఉల్లంఘనలకు వ్యతిరేకంగా శుక్రవారం ఒడిశాలోని ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. ప్రదర్శన ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు రంగంలోకి ఆందోళనకారుల్ని చెదరగొట్టారు. అప్రజాస్వామ్య, నిరంకుశ మతతత్వ మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలనే నినాదం చేసిన ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేయడం తగదన్నారు.

మల్కన్‌గిరి: 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మల్కన్‌గిరిలో కాంగ్రెస్ పార్టీ నేతలు ధర్నా చేపట్టారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్ విశాల్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవింద పాత్రో, జి.శ్రీనివాసరావు, పరుశురామ్‌భక్తో తదితరులు పాల్గొన్నారు.

జయపురం: పార్లమెంట్‌లో విపక్ష సభ్యులను సస్పెండ్ చేసి ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని ఒడిశా రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి మీణాక్షీ బాహిణీపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీల సస్పెండ్ చేసినందుకు నిరసనగా జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పట్నాయక్, పార్టీ జిల్లా కోశాధికారి బిశాయి తదితరులు పాల్గొన్నారు.


మల్కన్‌గిరి: ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో కాంగ్రెస్ కార్యకర్తలు


జయపురం: ఆందోళన చేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి మీణాక్షీ బాహిణీపతి, నాయకులు

భిన్న సంస్కృతులకు వేదిక చౌయితి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి సరక. పక్కనే ఎమ్మెల్యే ముదులి తదితరులు

రాయగడ: రాష్ట్రంలో భిన్న జాతులు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టేవే చౌయితి వేడుకలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. రాయగడలోని అటానమస్ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి కళాశాల చౌయితి పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడమే చౌయితి ఉత్సవాల లక్ష్యమన్నారు. గొవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ బొబిలత షరఫ్ మాట్లాడుతూ జిల్లాలో 11 సమితుల పరిధిలోఅన్ని డిగ్రీ, ప్లస్‌టూ కళాశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం, ముగ్గులు, మిల్లెట్ వంటకాలు తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కన్వీనర్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర అర్చన పట్నాయక్, కో ఆర్డినేటర్ సరోజ్‌కుమార్ సాహు, భగవాన్ విశ్వాల్ తదితరులు ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

సేంద్రియ వ్యవసాయమే మేలు


ఎస్‌హెచ్‌జీ బృందాలు విక్రయిస్తున్న చీపుర్లను పరిశీలిస్తున్న గవర్నర్ రఘుబారిదాస్

- రాష్ట్ర గవర్నర్ రఘుబారి దాస్

రాయగడ: ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ సేంద్రియ సాగుపై ఆసక్తి కనబరచాలని రాష్ట్ర గవర్నర్ రఘుబారిదాస్ రైతులకు సూచించారు. శుక్రవారం రాయగడలోని సదరు సమితి పరిధిలో గుమ్మ గ్రామంలో స్వయం సహాయక బృందాల మహిళలతో సమావేశమయ్యారు. కొండచీపుర్ల వ్యాపారంలో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హలువ గ్రామంలో రైతులు, గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వ్యవసాయపరంగా అభివృద్ధి చెందాలన్నారు.

ఆధునిక వ్యవసాయ విధానాలకు తోడుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు వినియోగిస్తే భూమి సారవంతం కోల్పోతుందన్నారు.

ప్రకృతి వనరులకు పుట్టినిళ్లు..

రాష్ట్రం ప్రాకృతిక వనరులకు పుట్టినిళ్లుగా గుర్తింపు పొందిందని గవర్నర్ దాస్ అన్నారు. ఉన్న వాటిని సద్వినియోగపరుచుకుంటే రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజ వేస్తుందన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందుతున్న రాయగడ జిల్లా మరింత అభివృద్ధి చెందాలన్నారు.

రైతులతో ముఖాముఖి..

గవర్నర్‌తో ముఖాముఖిలో కొంత మంది రైతులు తమ సమస్యలు వివరించారు. హలువ గ్రామానికి చెందిన కాశీనాథ్ జకక మాట్లాడుతూ తమ ప్రాంతంలో సాగు నీటి సౌకర్యం లేకపొవడంతో వ్యవసాయ పరంగా రాణించలేకపోతున్నామని చెప్పారు. జములిమ్మకి చెందిన రైతు మల్లన్న సరక మాట్లాడుతూ 2017 నుంచి మిల్లెట్ మిషన్ పథకం ద్వారా రాగుల పంట సాగు చేస్తున్నామని తెలిపారు. చెక్ డ్యామ్‌లు నిర్మించి సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సరిగుడలోని ఏకలవ్య ఆదర్శ విద్యాలయానికి వెళ్లిన గవర్నర్ విద్యార్థులతో కాసేపు గడిపారు. జగన్నాథ మందిరం, మజ్జిగౌరి మందిరాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. గవర్నర్ వెంట జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి కమలా కాంత్ కుహరో పాల్గొన్నారు.


ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

క్లుప్తంగా

ఎస్‌ఐలుగా అన్నదమ్ములు ఎంపిక



ఎస్‌ఐ ఉద్యోగాలను సాధించిన అన్నదమ్ములు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు కలిశెట్టి రాంబాబు, రవి ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో విజయం సాధించారు. 232, 238 మార్కులు సాధించి ఏపీఎస్పీ ఎస్‌ఐలుగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు కలిశెట్టి సన్యాసినాయుడు, అన్నపూర్ణ వ్యవసాయ పనులు చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. అన్నదమ్ములు ఉద్యోగాలు సాధించడంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

రిమాండ్‌ ఖైదీ పరారీ



ఖైదీ పరారీపై వివరాలు సేకరిస్తున్న కోటబొమ్మాళి ఎస్‌ఐ మహమ్మద్‌ అలీ

కోటబొమ్మాళి: శ్రీకాకుళం అంపోలు జైలులో రిమాండ్‌ ఖైదీగా ఉన్న సంతబొమ్మాళి మండలం బడేనర్సపురానికి చెందిన నైనపాత్రుని ముకుందరెడ్డి శుక్రవారం కోటబొమ్మాళిలో ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌డ్‌ పోలీసుల నుంచి తప్పించుకొని పారిపోయాడు. ఎస్‌ఐ షేక్‌ మహమ్మద్‌ అలీ తెలిపిన సమాచారం ప్రకారం.. నర్సపురంలో మూడు నెలల కిందట శివాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముకుందరెడ్డి రిమాండ్‌ ఖైదీగా అంపోలు జైలులో ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం జైలు నుంచి ఇద్దరు ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌డ్‌ పోలీసులు ముకుందరెడ్డిని కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచారు. కేసు జనవరి 5కు వాయిదా వేశారు. అనంతరం ముకుందరెడ్డిని జైలుకు తీసుకెళ్లేందుకు కోర్టు సమీపంలోని బస్టాప్‌ వద్ద వేచి ఉన్నారు. అంతలో మూత్ర విసర్జనకు వెళ్తానని చెప్పిన ముకుంద రెడ్డి అక్కడి నుంచి మెల్లగా జారుకుని జాతీయ రహదారి దాటి కిష్టుపురం వంశధార కాలువ వైపు పారిపోయాడు. పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించినా అతను దొరకలేదు. దీనిపై సమాచారం అందుకున్న కోటబొమ్మాళి ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి రాత్రి వరకూ సమీప గ్రామాలు, తిలారు, కోటబొమ్మాళి రైల్వే స్టేషన్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌డ్‌ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్‌ఐ తెలిపారు.

'ముమ్మరంగా గార ఎస్‌బీఐ కేసు దర్యాప్తు'

శ్రీకాకుళం క్రైమ్ : గార ఎస్‌బీఐ కేసు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నామని డీఎస్పీ యర్రగుంట శ్రుతి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గార ఎస్‌బీఐ బంగారం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరినీ కోర్టు అనుమతితో మళ్లీ విచారించామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి విభిన్న కోణాల్లో విచారణ చేస్తున్నామని వెల్లడించారు. క్యాషియర్‌ సురేష్‌పై కేసు బయట పడక ముందు జరిగిన దాడి విషయాన్ని ప్రస్తావించగా.. ఇంకా దర్యాప్తులోనే ఉందని సమాధానం చెప్పారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ మ్యూచువల్‌ ఫండ్స్‌పై వస్తున్న ఆరోపణలు, అవకతవకల విషయం తమ దృష్టికి రాలేదని ఆమె తెలిపారు. ఖాతాదారులు మోసపోయామని గానీ, బ్రాంచి సిబ్బంది నుంచి గానీ ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

పుణ్యప్రదం.. గిరి ప్రదక్షిణ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం శనివారం నిర్వహించే ముక్కోటి ఏకాదశి పూజలకు ముస్తాబైంది. మెట్లోత్సవంతో పాటు, స్వామివారి ఉత్తర ద్వారదర్శనం, గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి విశిష్టమైనది. భక్తులు శ్రీ కోదండ రామస్వామివారి బోడికొండ చుట్టూ మొత్తం 8 కిలోమీటర్ల మేర రామనామాన్ని జపిస్తూ ప్రదక్షిణ చేస్తారు. అనంతరం బోడికొండపై ఉన్న కోదండ రాముడికి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. స్వామివారిని ఎంత పవిత్రంగా పూజిస్తారో.. గిరి (పర్వతాన్ని) కూడా భక్తులు అంతే పవిత్రంగా భావిస్తారు. ఎంతో మంది రుషులు తపస్సు చేసి స్వామివారి అనుగ్రహం పొంది అదే పర్వతంపై వృక్షాలు, శిలలుగా మారిపోయారని భక్తులు విశ్వసిస్తారు. అటువంటి గొప్ప పర్వతం చుట్టూ ప్రదక్షణలు చేస్తే పుణ్యం లభిస్తుందనేది భక్తుల నమ్మకం. రామనామస్మరణతో పర్వతం చుట్టూ గిరిప్రదక్షిణ చేయడం వల్ల ఆ ప్రాంతమంతా పునీతమవుతుందని అర్చకులు చెబుతున్నారు. ఒకసారి గిరిచుట్టూ ప్రదక్షిణ చేస్తే భూమండలం చుట్టూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం లభిస్తుందని ప్రతీతి. పాండవులు నడయాడిన నేల కావడంతో గిరి పర్వతం చుట్టూ నడిచేందుకు భక్తజనం ఉవ్విళ్లూరుతోంది. వేకువజామున 3 గంటలకు స్వామివారికి ఆరాధన, 4 గంటలకు తిరుప్పావై సేవా కాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి పూర్తయిన తర్వాత మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణ నడుమ తెల్లవారు జామున 5 గంటలకు స్వామివారి ఉత్తరద్వార దర్శనానికి భక్తులకు అవకాశం కల్పిస్తారు. ఉదయం 7.30 గంటల వరకు స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు అవకాశం ఉంటుంది.

యంత్ర ముగ్ధం



ఆస్తులు తాకట్టు పెట్టి.. ఉన్నదంతా ఆస్పత్రులకు ధారబోసి, ఆఖరకు ప్రాణాలు వదిలేసిన వారి కథలు ఉద్దానంలో ఊరూరా కనిపిస్తాయి. ఉన్న చోట ఉన్నత వైద్యం దొరక్క, ఊరు విడిచి పెట్టి వెళ్లి చికిత్స చేయించుకునే స్థోమత లేక ఊపిరి ఆగిపోయిన దీనగాథలు ఏ వీధికి వెళ్లినా వినిపిస్తాయి. అలాంటి వేదనలకు స్వస్తి పలుకుతూ పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం సరికొత్త యంత్రాలతో సిద్ధమైంది. విశాఖ వెళ్తే గానీ దొరకని అత్యున్నత వైద్యం ఇక్కడ ఇక నుంచి ఉచితంగానే లభించనుంది. భవనాల నిర్మాణాలకే పరిమితమైపోకుండా అధునాతన యంత్రాలను తెప్పించి సర్కారు తన చిత్తశుద్ధిని చాటుకుంది. రూ.కోట్లు విలువ చేసే ఈ యంత్రాల వివరాల్లోకి వెళితే.. – కాశీబుగ్గ

- కిడ్నీ ఆస్పత్రిలో అధునాతన యంత్రాలు
- సామాన్యులకు అందుబాటులో ఖరీదైన వైద్యం
- విశాఖ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే చికిత్సకు అవకాశం



సీటీ స్కాన్



రూ.రెండు కోట్లతో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్

రూ.రెండు కోట్లు ఖరీదైన కెనాన్ కంపెనీకి చెందిన సీటీ స్కానింగ్ మిషన్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. సీటీ స్కాన్ చేయాలంటే శ్రీకాకుళం, విశాఖ వెళ్లక తప్పేది కాదు. ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లినా రూ.4 వేల నుంచి రూ.6వేలు ఖర్చవుతుంది. ఇప్పుడు ఇక్కడే ఆ సేవలు ఉచితంగా లభిస్తాయి. కిడ్నీ రోగులకే కాదు ఈ ప్రాంతంలో అత్యవసర సేవలన్నింటికీ ఈ మిషన్ ఉపయోగపడుతుంది.

ఈఎస్‌డబ్ల్యూఎల్



రూ.రెండు కోట్ల విలువైన ఈఎస్‌డబ్ల్యూఎల్ మిషన్

కిడ్నీలో రాళ్లను ఎలాంటి ఆపరేషన్ లేకుండా తొలగించే మిషన్ ఇది. అధునాతన సాంకేతికతతో కూడిన ఈ మిషన్ ద్వారా కేవలం లేజరు కిరణాలతో విడతలగా రాళ్లను పగలగొడతారు. ఈ వైద్యానికి కార్పొరేట్ ఆస్పత్రిలో విడతకు రూ.20వేల నుంచి రూ.30 వేల చొప్పున రూ.లక్ష వరకు ఖర్చవుతాయి. ఈ యంత్రం ఖరీదు సుమారు రూ.2 కోట్లుపైగా ఉంటుంది.

ఆల్ట్రా సౌండ్ మిషన్

ఆల్ట్రా సౌండ్ మిషన్‌లు సుమారు ఐదు ఏర్పాటు చేశారు. ఒక్కో మిషన్ ఖరీదు రూ.20లక్షలు ఉంటుంది. అన్ని మిషనరీలు కలిపితే రూ.2 కోట్లు పైమాటే. ఇందులో కడుపులో భాగాలు, కిడ్నీలు వంటి భాగాలతో పాటు దేహంలో ఉన్న ఏ భాగాలనైనా సమస్య ఏమిటన్నది గుర్తించడానికి ఈ స్కానింగ్ విభాగం ఉపయోగపడుతుంది.

డిజిటల్ ఎక్స్‌రే



డిజిటల్ ఎక్స్‌రే మిషన్

కాలు, చేతులు, చెస్ట్ ఇతర ఏ ప్రాంతంలో ఎముకలు విరిగినా, పగళ్లు ఇచ్చినా జాయింట్లు తప్పినా ఏదైనా ఈ ఎక్స్‌రే ద్వారా తెలుస్తుంది. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మాత్రం పూర్తి డిజిటల్‌తో కూడుకున్నది. సుమారు రూ.10లక్షలపై ఖరీదు చేసే ఈ మిషన్‌లు అనేక రకాలు ఉన్నాయి. ఆ యూనిట్ అంతా ఓ గదిలో ఏర్పాటు చేశారు.

యూఆర్‌ఎస్‌ఎల్

ఇదో ప్రత్యేకమైన లేజరు మిషన్. కిడ్నీలోని రాళ్లను కటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. ముందు వివరించిన మిషన్ రాళ్లను బయట నుంచి కట్ చేస్తే ఈ మిషన్ మాత్రం పైపుద్వారా కిడ్నీకి చేరుకుంటుంది. అక్కడ కట్ చేసి ముక్కలను బయటకు తీసుకువస్తుంది. ఈ మిషన్ ఖరీదు రూ.25లక్షలపై ఉండవచ్చు. బయట ఆస్పత్రుల్లో ఈ చికిత్సకు రూ.60 వేలు వరకు చార్జ్ చేస్తారు.

రిఫ్రిజిరేటర్‌లు



-80 డిగ్రీ సెంటీగ్రేడ్ ఫ్రీజర్

కిడ్నీ వ్యాధిగ్రస్తులు, ఇతర వ్యాధులతో ఉన్నవారి కోసం అవయవాలను దాచాలన్నా, భద్రంగా ఉంచాలన్నా -80 డిగ్రీలు, -40 డిగ్రీల సెంటీగ్రేడ్ రిఫ్రిజిరేటర్లు కావాలి. కిడ్నీ పరిశోధన చేసే పరిశోధకులకు ఇవి శాంపిల్ కలెక్షన్, వాటి పరిశీలనకు ఉపయోగపడుతుంది.

క్రయోస్పాట్ మిషన్

కాన్సర్‌కు గురైనటువంటి సెల్స్‌ను, శరీర భాగాలను కలపడం వంటి ప్రక్రియల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. సుమారు రూ.ముప్పై లక్షలు ఖరీదు చేసే ఈ యంత్రంతో వైద్యం పొందాలంటే ఇదివరకు పెద్ద పట్టణాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఇక్కడ ఉచితంగా అందించనున్నారు.

పది వెంటిలేటర్లు..



అధునాతన హంగులతో ఆపరేషన్ థియేటర్

అత్యవసర పరిస్థితిలో ఆక్సిజన్ అందనని వారికి వెంటిలేటర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇప్పుడిప్పుడు శ్రీకాకుళం పట్టణానికి వచ్చాయి. ఇది వరకు విశాఖపట్నం పరుగులు పెట్టేవారు. ఒక్కో వెంటిలేటర్‌కు రూ.12లక్షల వెచ్చించి పది వెంటిలేటర్‌లకు రూ.1.20 కోట్లు కేటాయించి ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితి వస్తే పలాస చేరుకుంటే సరిపోతుంది.

ఫుల్లీ ఆటోకెమిస్ట్ బయోకెమిస్ట్ ఎనలైజర్

ఈ యంత్రం కిడ్నీ పరిశోధన కేంద్రానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్, బ్లడ్ సెల్స్ టెస్ట్, క్రియోటిన్ లెవెల్స్‌తో పాటు 64 రకాల పరీక్షలు ఈ యంత్రంతో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉండే మోడల్ రూ.పన్నెండు లక్షలు. బయట మార్కెట్‌లో ఒక్కో పరీక్షకు ఒక్కో ధర ఆయా ఆస్పత్రిని బట్టి నిర్ధారిస్తారు. ఈ ఆస్పత్రిలో మాత్రం ఉచితంగా సేవలు అందుతాయి.



వివిధ రకాల పరీక్షలు జరిపే మిషన్లు

అత్యాధునిక యంత్రాలు ఉన్నాయి



ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని పరికరాలు పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేశారు. సీటీ స్కాన్, ఈఎస్‌డబ్ల్యూఎల్, యూఆర్‌ఎస్‌ఎల్ వంటి యంత్రాలన్నీ రూ.కోట్లు ఖరీదు చేస్తాయి. ఈ పరీక్షలు బయట చేయాలన్నా రూ.లక్షల్లో ఖర్చవుతుంది. కిడ్నీ రోగులకు ఉచితంగా ఆ సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వీటిని ఏర్పాటు చేశారు. డాక్టర్ రిఫర్ చేసిన విధానం బట్టి ఇక్కడ పరీక్షలు చేస్తారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులే కాదు ఈ ప్రాంతీయులకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ యంత్రాలు ఉపయోగపడతాయి.

– డాక్టర్ సి జయరాజ్, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం

పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేసేందుకు ఉన్నత విద్యా మండలి అనుమతి ఇచ్చినట్లు అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. వర్సిటీలో 16 కోర్సుల్లో ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విభాగాలు, సబ్జెక్టుల వారీగా 29వ తేదీ సాయంత్రం ప్రవేశాలకు అర్హత సాధించిన వారి జాబితా సిద్ధం చేసి, 30న ప్రవేశాలు నిర్వహిస్తామని అన్నారు. ఉన్నత విద్యా మండలి నిబంధనలు మేరకు రాష్ట్ర పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ అర్హత మార్కులు తప్పనిసరని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు వర్తించవని అన్నారు. ఫీజు స్ట్రక్చర్ మేరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

ఎంబీఏ, ఎంసీఏల్లో స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్ల నిర్వహణకు ఉన్నత విద్యా మండలి అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు ప్రవేశాలు చేసుకోవచ్చునని తెలిపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏలో 55 సీట్లు ఉండగా, 39 మంది ప్రవేశాలు పొందారు. 16 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎంసీఏలో 44 సీట్లకు 39 మంది ప్రవేశాలు పొందారు. ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయి. తక్షణ ప్రవేశాలకు ఏపీ ఐసెట్ ర్యాంకు తప్పనిసరిగా కాగా, ప్రభుత్వ రాయితీలు ఏవీ వర్తించవు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 గా నిర్ణయించారు. 28వ తేదీన సీట్లు పొందిన విద్యార్థుల వివరాలు వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

ఐటీఈపీలో ఐదుగురికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభించిన ఐటీఈపీ (నాలుగేళ్ల సమీకృత డిగ్రీకోర్సు)లో శుక్రవారం తక్షణ ప్రవేశాలు నిర్వహించారు. ఈ ప్రక్రియను అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ అర్హత సాధించిన ఐదుగురికి ప్రవేశాలు కల్పించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారి కోసం శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

నిధుల రికవరీకి కలెక్టర్ ఆదేశాలు

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం సచివాలయం పరిధిలో ఆర్బీకే భవనం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలను గతంలో కాంట్రాక్టర్ ప్రారంభించి సగంలోనే ఆపేశారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన సిమ్మెంటు బస్తాలను దుర్వినియోగం చేసినట్లు ఆయనపై కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో కమిటీ శుక్రవారం భవన నిర్మాణాల ప్రాంతాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణ పనులు కొనసాగించాలని సర్పంచ్ నూక సత్యరాజ్‌కు ఎంపీడీఓ సూచించారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక స్టేడియం వద్దగల సెయింట్ జోన్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం జరిగింది. చర్చి పాస్టర్ టి.రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. యువకులంతా కలసి క్రైస్తవ గీతాలాపనలు చేశారు. కార్యక్రమంలో డేవిడ్ సన్, స్టీవెన్, జాన్ సున్నీ, హేస్రీ, రేష్మా, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న యువతీ, యువకులు

'అంకితభావంతో పనిచేద్దాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: విధి నిర్వహణలో సిబ్బంది అంకితభావంతో ఉండాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టిరాజు అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏపీఓలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్లాంటేషన్ పనులతో పాటు ఫారం పాండ్స్, పెర్క్యులేషన్ ట్యాంకులు, మినీ పెర్క్యులేషన్ ట్యాంకులు, డగౌట్ పాంట్స్, మినీ గోకులాలు వంటి పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పంట కాలువల పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల పనులను గుర్తించి ఎస్టిమేషన్లు వేయాలని సూచించారు. వ్యక్తిగత పండ్ల తోటల పెంపకంతో పాటు మునగ మొక్కల పెంపకంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. హౌసింగ్ 90 పది జనాల కల్పన పనులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అన్ని పంచాయతీల పరిధిలోనూ పనులను ప్రారంభించారని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేతనదారులు పనులకు వచ్చే విధంగా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వంద రోజుల పనితో పాటు, సగటు వేతనం రూ. 250 వచ్చేలా చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

● అందంగా క్రీస్తు మందిరం





క్రిస్మస్‌కు చర్చిలు అందంగా ముస్తాబవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పురాతన ఆరాధన మందిరాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీలతో సుందరంగా మారుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

● జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుకు పూర్తి భరోసా కల్పించేలా, అత్యంత పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా రూపొందించిందని తెలిపారు. రైతు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరను ఇవ్వడం మన బాధ్యత అని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. జిల్లాల్లో ఇప్పటి వరకూ 12,194 మంది రైతుల నుంచి 70 వేల టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు.

ఇందులో జలుమూరు, సారవకోట, నరసన్నపేట, సంతబొమ్మాళిలో రైతులు ఎక్కువ సంఖ్యలో ధాన్యం తరలించేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. పలాస, రణస్థలం, పొందూ రు, హిరమండలం, కవిటి, కంచిలి మండలాల్లో ఇంకా కేంద్రాలు ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జీపీఎస్ పరికరాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టండి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వంశధార, నాగావళి నదుల పరిధిలోని ప్రాజెక్టుల నుంచి ఈ ఏడాదికి రబీ పంటల సాగుకు ఆశించిన స్థాయిలో సాగు నీరు ఇవ్వడం సాధ్యం కాదని జేసీ చెప్పారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వరి పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ముందస్తు రబీ పంటలు, కాలువల కింద ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై సమావేశంలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కాలువల నుంచి రానున్న 15 రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని, అలాగే నారాయణపురం నీటితో కూడా చెరువులు ఆయా చోట్ల నిండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మడ్డువలసలో నీటి కొరత కారణంగా 1500 ఎకరాలకు రబీ కింద నీరు ఇవ్వడం సాధ్యమవుతుందని చెప్పారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాద్, డీఎస్ఓ వెంకట రమణ, జల వనరుల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, పశు సంవర్ధక శాఖ జేడీ కిశోర్, మత్స్య శాఖ నుంచి గంగాధర్, డ్వామా పీడీ చిట్టి రాజు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసు, పలువురు ఏడీలు తదితరులు హాజరయ్యారు.



పునరావాస కాలనీ పనులను పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పునరావాస కాలనీ పనుల పరిశీలన

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్వాసితుల కోసం నౌపడ వద్ద నిర్మిస్తున్న పునరావాస కాలనీ పనులను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో పాటు ఆర్అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు పునరావా స కాలనీ పనులు ఎంత మేరకు పూర్తయ్యా యో అడిగి తెలుసుకున్నారు. జనవరి నెలలో నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడించారు. అనంతరం పోర్టు రైల్వే లైన్ కోసం పోతునాయుడుపేట, కాశీపురం, కోటపాడు గ్రామాలను పరిశీలించారు. వీరితో పాటు ఆర్ అండ్ బీ ఎస్ఈ జె.సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, పీఆర్ ఈఈ, తహసీల్దారు చలమయ్య ఉన్నారు.

ప్రతిభకు పరీక్ష

విజయనగరం ఫూల్‌బాగ్: జాతీయ బాలికా దినోత్సవాన్ని (జనవరి 24) పురస్కరించుకున్ని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 'ఆడబిడ్డను కాపాడండి' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. ఈ నెల 30న పాఠశాల స్థాయిలో హెచ్‌ఎం ఆధ్వర్యంలోను, జనవరి 3న మండల స్థాయిలో ఎంఈఓ కార్యాలయాల వద్ద, జనవరి 6న జిల్లా స్థాయిలో డిప్యూటీ డీఈఓ ఆధ్వర్యంలో విజయనగరంలోని ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కోదశలో నిర్వహించే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారే తదుపరి పోటీలకు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారులు చొరవచూపాలని కోరారు.